
ప్రజాశక్తి
ఆదివారం 6 జూలై 2025
5
పార్వతీపురం మన్యం



ఎడతెరిపి లేకుండా వర్షాలు

బోసిపోయిన ప్రధాన కూడళ్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గత 5 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు బయటకు వచ్చేందుకు అవకాశం లేక తమ రోజువారీ కార్యకలాపాలు చేసుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. శనివారం తెల్లవారుజామున 3 గంటల నుండే వర్షం ఏకధాటిగా కురవడంతో ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ప్రధాన కూడళ్లన్నీ జనసంచారం లేక బోసిపోయాయి. దీంతో పట్టణ ప్రధాన రహదారి పక్కన వ్యాపారం చేసుకునే రోజువారీ చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు జరగక నష్టాలపాలయ్యారు. ఈ వర్షాలతో రైతులు తమ వ్యవసాయ పనులు ముందస్తుగానే చేసుకునేందుకు అవకాశం ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్

ప్రజాశక్తి - పార్వతీపురం



జిల్లాలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం ఈనెల 10న జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తదితరులతో ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు తదితర అన్ని మేనేజ్‌మెంట్ విద్యాసంస్థలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 1787 విద్యా సంస్థలు ఉన్నాయని, అందులో 1,29,730 మంది విద్యార్థులు చదువుతున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు భోజనం, క్రీడలు, తల్లికి వందనం (తల్లి నుండి ఆశీర్వాదం తీసుకోవడం) నిర్వహిస్తామని చెప్పారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి వై నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి విస్తృత ఏర్పాట్లు చేయాలి

ఈనెల 10న జిల్లాలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహణ పట్ల సంబంధిత అధికారులను వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశించారు. ప్రతి విద్యార్థి కొత్త స్కూల్ యూనిఫాం ధరించాలని, సర్వేపల్లి రాధా కృష్ణన్ స్కూల్ కిట్లు ఉండాలని ఆయన ఆదేశించారు. ఉదయం 9 గంటలకు నుంచి కార్యక్రమాలు ప్రారంభం కావాలని, 11 గంటల వరకు విద్యార్థుల ప్రగతిని తెలిపి, తల్లిదండ్రులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఫ్లెక్సీలో ఎవరి ఫోటోలు ఉండరాదన్నారు. ప్రజాప్రతినిధులను సమావేశంలో పాల్గొనేలా ఆహ్వానించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, సి యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి ధర్మచంద్రా రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలపై చర్చలు సానుకూలం

15లోగా పరిష్కరించాలని లేబర్ కమిషనర్ ఆదేశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఆర్టీసీ డిపోలో ఉన్న హైర్ బస్సు డ్రైవర్ల డిమాండ్లు ఆమోదించాలని కోరుతూ చేపట్టిన నిరసన కార్యక్రమాలు, గేటు వద్ద ధర్నాలతో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో బస్సు యజమానులు, డిపో మేనేజర్ సమక్షంలో చర్చలు జరిగాయి. పది రోజుల్లో ఒప్పందం చేసుకోవడానికి యజమానులు అంగీకరించారు. జూలై 15న మలి విడత చర్చలు జరుగనున్నాయి. దీంతో ఈనెల 10న చేపట్టబోయే సమ్మెను 17కి వాయిదా వేశారు. శనివారం జరిగిన చర్చల్లో హైర్ బస్ యజమాన్యం ప్రతినిధులు రవీందర్ రెడ్డి, ఎ.అయ్యప్ప, పి.కోటేశ్వరరావు, కె.గౌరీశంకర్రావు, డిపో మేనేజర్, అధికారులు హైయర్ బస్సు డ్రైవర్లు, కాంట్రాక్టువర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులసీరామ్, పార్వతీపురం డిపో యూనియన్ ప్రెసిడెంట్ కెవి చారి, సెక్రటరీ పిడి ప్రసాద్, ఎ.అశోక్, సీనియర్ నాయకులు విడి ప్రసాద్, సునీల్, వివి రమణ తదితర కార్మికులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై మన్మధరావు ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, కోశాధికారి గొర్ల వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అద్దె బస్సు యజమానులు, ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించి డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మోసగించడంలో గిన్నీస్ రికార్డు బాబుదే

- వైసిపి రీజినల్ కోఆర్డినేటర్ కె.కన్నబాబు
- ప్రభుత్వ వంచనను తెలియజేయడానికే ప్రజల్లోకి..
- శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



వైసిపి జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - పార్వతీపురం/టౌన్

రాష్ట్రంలో ప్రజలను మోసగించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుది గిన్నిస్ రికార్డు నమోదవుతుందని వైసిపి రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు విమర్శించారు. పట్టణంలోని రాయల్ కన్వెన్షన్ హాలులో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన జిల్లా వైసిపి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువ మోసాలు చేసిన నాయకుడికి స్థానం కల్పిస్తే అది చంద్రబాబు నాయుడు కే దక్కుతుందన్నారు. మోసాలు లేని పరిపాలన బాబు హయాంలో లేదన్నారు. ఎన్నికల ముందు ఎన్నో అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ఏడాదిలో ప్రజలకు మొండిచేయి చూపించారని ఆరోపించారు. చంద్రబాబు నాయుడులో మార్పు వచ్చిందని ప్రజలు నమ్మి ఓటు వేశారని, కానీ ఆయనలో ఏ మార్పు రాలేదన్నారు. ఓటేసిన వారిని కాటేయడమే ఆయనకు అలవాటన్నారు. 50ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బిసిలకు పింఛను మంజూరు చేస్తామని చెప్పిన టిడిపి ప్రభుత్వం ఎక్కడ అమలు చేసిందని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీల గురించి అడిగితే నాలుక మందం అని చంద్రబాబు నాయుడు విమర్శిస్తున్నారని చెప్పారు. నిరుద్యోగ యువతకు భృతి, ఆడబిడ్డలకు నెలనెలా డబ్బులు ఇస్తామని చెప్పి మోసం చేసిందని ధ్వజమెత్తారు. వైసిపి కార్యకర్తలకు పనులు చేయొద్దని సిఎం చంద్రబాబు అధికారులకు చెప్పడం, ఒకవేళ పనులు చేస్తే పాముకి పాలు పోసినట్లేనని వ్యాఖ్యానించడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. వైసిపి కార్యకర్తలు రాష్ట్ర జనాభాలో లేరా అని ప్రశ్నించారు. మొదటి ఏడాదిలో ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలు ఎగ్గొట్టి ఇప్పుడు కహానీలు చెపుతున్నారని అన్నారు. అబద్ధాలాడి అధికారంలోకి రావడం టిడిపికి అలవాటయిందని విమర్శించారు.

మోసాల గురించి తెలియజేయడానికే ప్రజల్లోకి: బొత్స

గడిచిన ఏడాదిలో టిడిపి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు, అరాచకాల గురించి తెలియజేయడానికే ప్రజల్లోకి వెళ్లాలని వైసిపి అధినేత జగన్ దిశానిర్దేశం చేశారని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ చెప్పారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి లో సమావేశాలు నిర్వహించిన తర్వాత గ్రామాల్లోకి వెళ్లి టిడిపి కూటమి ప్రభుత్వం మోసాలు, అరాచకాల గురించి చెప్పాలని కోరారు. ప్రతిపక్షం ప్రభుత్వ విధానాలు, పథకాల అమలులో లోపాలను ఎత్తి చూపి ప్రశ్నిస్తుందన్నారు. ఆ పనిలో భాగంగానే టిడిపి కూటమి పార్టీలు ఇచ్చిన హామీలేమిటి, ఏడాదిలో ఎంతవరకు అమలయ్యాయనేది ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ఇచ్చిన హామీ లను అమలు చేయాలని ప్రశ్నిస్తే సిఎం చంద్రబాబు నాయుడు తోక కత్తిరిస్తామని, నాలుక మందమని హెచ్చరిస్తున్నారని చెప్పారు. సనాతన ధర్మం గురించి గొప్పగా చెప్పుకుంటున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, సిఎం చంద్రబాబు నాయుడు ఎంతవరకు ఇచ్చిన మాట మీద నిలబడ్డారని ప్రశ్నించారు. త్రికరణ శుద్ధి తో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చంద్రబాబుతో కలిసి చెప్పిన పవన్ కళ్యాణ్ సనాతన ధర్మంలో అదే వుందా అని ప్రశ్నించారు. ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కని, ప్రభుత్వం మెడలు వంచి పనులు జరిగేలా చూస్తామని చెప్పారు. టిడిపి కూటమి నేతల బెదిరింపులకు భయపడేది లేదని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు పై ఇంతవరకు స్పష్టత లేదని చెప్పారు. చంద్రబాబు నాయుడు వంద అబద్దాలాడితే ఆయన కొడుకు లోకేష్ రెండు వందల అబద్ధాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట్లాడుతూ గడిచిన ఏడాదిలో టిడిపి ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో పాఠశాల నిర్మించలేని దుస్థితి లో వుందన్నారు. సాలూరు మండలం తోణాం పంచాయతీ మెట్టవలసలో గిరిజనులు కూలి డబ్బుతో పాఠశాల నిర్మించుకున్నారని, నిధులు వున్నా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి పాఠశాల నిర్మించలేదన్నారు. మక్కువ మండలం పెద్దవలసలోనూ ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మించలేదని మంత్రి సంధ్యారాణి తనను విమర్శిస్తున్నారని, గడిచిన ఏడాదిలో ఎవరు మంత్రిగా ఉన్నారని ప్రశ్నించారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లలో కనీసం సౌకర్యాలు లేవన్నారు.రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. భర్తలు కోల్పోయిన మహిళలకు కూడా పింఛను ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం వుందన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడాది కాలంలో టిడిపి ప్రభుత్వం చేసిన మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రానున్నది వైసిపి ప్రభుత్వమేననీ చెప్పారు మాజీ మంత్రి పుష్ప శ్రీవాణి మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది పాలన అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా , అవినీతి కి అడ్డాగా మారిందని ఆరోపించారు. కురుపాం ఎమ్మెల్యే లాంటి నాయకులు ధనవంతుల జాబితాలో చేరారని చెప్పారు. ఎంపీ డాక్టర్ తనూజా రాణి, మాజీ ఎంపీ మాధవి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్, మాజీ ఎమ్మెల్యేలు జోగారావు, కళావతి, మాట్లాడారు. సమావేశం లో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, మూడు మండలాల జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, ఎంపిటిసిసభ్యులు, సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుమరాడ గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకొండ

ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చిన్నతరహా పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు సుపరి పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మండలంలోని తుమరాడలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి ప్రజలతో మాట్లాడారు. ఏడాదిలో అనేక మంచి కార్యక్రమాలు చేపడుతున్నామని, ప్రజలు దీన్ని గమనించాలని అన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ త్వరలో అందిస్తామన్నారు. ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన అరాచకాలు ఇప్పటికే ప్రజలు మర్చిపోలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ తమ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇదిలా ఉండగా తమ గ్రామంలో నీటి సమస్య ఉందని మహిళలు చెప్పడంతో ఈ సమస్య వెంటనే పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల కేటాయించినప్పటికీ విద్యుత్తు వైర్లు ఆ స్థలం నుంచి వెళు_న్నాయని, దీంతో నిర్మాణాలకు ఇబ్బందిగా ఉందని, వీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. మంత్రి అక్కడి నుంచే విద్యుత్ శాఖ ఎస్ఇకి ఫోన్ చేసి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పడాల భూదేవి, అరకు పార్లమెంటు పరిశీలకులు హర్షవర్ధన్, డిసిసిబి వైస్ చైర్మన్ సువ్వాల సూర్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు మండల పార్టీ అధ్యక్షులు గండి రామి నాయుడు, వారాడ సుమంత్ నాయుడు, జాడ శ్రీధర్ తదితరులు ఉన్నారు.



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

లోక్ అదాలత్ లో 116 కేసులు రాజీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 116 కేసులను ఇరువురి అంగీకారంతో రాజీ చేసినట్టు స్థానిక రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ మంచి మార్గదర్శిగా ఉపయోగపడుతుందన్నారు. సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద పరిహార కేసులు, ఇతర వివాదాలను పరిష్కరించడం శుభ పరిణామమని పేర్కొన్నారు. కక్షిదారులు రాజీ చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గుతాయని, మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. కోర్టుకు ఎటువంటి ఫీజు చెల్లించకుండా, కేసులు రాజీ చేసుకోవచ్చని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే మొదట చెల్లించిన రుసుమును కక్షిదారులకు కోర్టు తిరిగి చెల్లిస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో బాధితులకు న్యాయం త్వరగా లభించే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో సుమారు రూ.18,24,808 విలువైన కేసులను రాజీ చేసినట్టు తెలిపారు. వీటిలో అమలు దావాలు 16, చెక్ బౌన్స్ కేసులు 03, ఐపిసి కేసులు 60, మైంటెనెన్సు కేసు 1, డైవర్స్ కేస్ 1, మోటారు యాక్సిడెంట్ కేసులు 03, విలువ రూ:11,65,000, సివిల్ దావాలు 04, విలువ రూ: 4,74,800, ఎక్సైజ్ కేసులు - 28, విలువ రూ: 1,85,108, ప్రిలిటిగేషన్ కేసులు -1,ప్రిలిటిగేషన్ కేసులో ఆస్తి వివాదంలో కూతురు తల్లిపై వేసిన కేసులో కుమార్తెకు ఆరు ఎకరముల భూమిని తల్లి ద్వారా ఇప్పించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్యా జాస్పిన్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.చంద్ర కుమార్, బార్ ప్రెసిడెంట్ ఎన్. శ్రీనివాసరావు, లోక్ అదాలత్ సభ్యులు, అధిక సంఖ్యలో కాక్షిదారులు పాల్గొన్నారు.

జిల్లాలో 42,817 బంగారు కుటుంబాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 42,817 బంగారు కుటుంబాలు ఉన్నాయని, వీటిని మార్గదర్శి (గైడ్)తో సమన్వయం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ వర్క్‌షాప్ నిర్వహించి, కుటుంబాన్ని పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. బంగారు కుటుంబం, మార్గదర్శి మధ్య అంతరాన్ని పూడ్చడానికి అధికారిక బృందం స్ఫూర్తితో పనిచేయాలన్నారు. యోగాంధ్రలో జిల్లా బృందం చేసిన కృషిని కలెక్టర్ ప్రశంసించారు. కుటుంబం ఒక నిర్దిష్ట స్థాయికి చేరుకొనేంత వరకు నిరంతర సమన్వయం చేయాన్నారు. ఇళ్లను మార్గదర్శితో మ్యాప్ చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా ఉంటారని అన్నారు. డిఆర్‌డిఎ మెప్మా ఈ పనిలో కీలక పాత్ర పోషించాలని ఆదేశించారు. జెసి ఎస్ ఎస్ శోబిక మాట్లాడుతూ పి 4 వెబ్‌సైట్‌లో మార్గదర్శిగా నమోదు చేసుకోవడానికి ముందుకు రావాలని కోరారు. సమావేశంలో పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సియశ్వంత్ కుమార్‌రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్‌సి ఎస్‌డిసి ధర్మారెడ్డి, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పది కుటుంబాలకు మార్గదర్శిగా మంత్రి

సాలూరురూరల్: పి 4 - బంగారు కుటుంబం - మార్గదర్శిలో భాగంగా పది కుటుంబాలకు మార్గదర్శిగా నిలుస్తున్నట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి ప్రకటించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజక వర్గం కార్యాచరణ ప్రణాళికపై సమావేశంలో మాట్లాడుతూ నియోజక వర్గంలోని ప్రతి మండలం నుంచి రెండు కుటుంబాలు, సాలూరు మున్సిపాలిటీ నుండి రెండు కుటుంబాలకు మార్గదర్శిగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె. రామచంద్ర రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్: నియోజకవర్గంలో గుర్తించిన బంగారు కుటుంబాలను తీర్చిదిద్దాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. పార్వతీపురం నియోజక వర్గ స్థాయి విజన్ యాక్షన్ ప్లాన్, బంగారు కుటుంబం - మార్గదర్శి కార్యక్రమంపై శనివారం గిరి మిత్ర సమావేశ మందిరంలో సమావేశం జరిగింది. కుటుంబాలను మార్గదర్శి (గైడ్) తో సమన్వయం చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే బి.విజయ చంద్ర మాట్లాడుతూ ప్రతి కుటుంబం సమాజంలో గౌరవంగా బతకాలన్నారు. అందుకు ఆర్థికంగా ముందంజ వేయాలని, ఆయా కుటుంబాలకు అవసరమైన చేయుత అందించి పరిపుష్టి పొందుటకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

పురుగులు పట్టిన సన్న బియ్యం పరిశీలన

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల ఉన్నత పాఠశాలతో పాటు నర్సిపురం- గోర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ ప్రైమరీ పాఠశాలలకు మధ్యాహ్న భోజనానికి అందజేసిన సన్నబియ్యాన్ని సివిల్ సప్లై క్వాలిటీ అధికారులు శనివారం పరిశీలించారు. బియ్యం ప్యాకెట్ విప్పి అందులో బియ్యాన్ని బయటికి తీసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై క్వాలిటీ అధికారులు అన్వేష్, మహేష్ మాట్లాడుతూ పాఠశాలలకు పంపిణీ చేసిన సన్న బియ్యాన్ని పరిశీలించగా అందులో పురుగులు ఉన్నట్లు గుర్తించామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అన్నారు. రెండు, మూడు రోజుల్లో వేరే బియ్యం పాఠశాలలకు పంపిణీ చేస్తామని, ప్రస్తుతం ఉన్న బియ్యాన్ని శుభ్రంగా చేసి విద్యార్థులకు వండి పెట్టాలని వంటి ఏజెన్సీలకు సూచించినట్లు వారు తెలిపారు. వీరితోపాటు ఎంఇఒ- 2 ఆర్ ఆనందరావు ఉన్నారు.

10న విద్యుత్తు వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద ఈనెల 10న విద్యుత్తు వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎఇ కె.అనిల్ కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. సిజిఆర్ఎఫ్ కార్యక్రమంలో భాగంగా లోవోల్టేజ్ సమస్య ఉన్న, అధికంగా మీటర్ రీడింగ్ తిరిగినా, అధికంగా బిల్లులు వచ్చినా పరిష్కార వేదికలో వినియోగదారులు ఫిర్యాదు చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేన్సర్ కారణాలపై నిగ్గుతేల్చేందుకు కమిటీ పరిశీలన

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గంగరేగువలస, కంబవలస పంచాయతీ రాజ్యలక్ష్మిపురంలో ఇటీవల కాలంలో కేన్సర్ బారినపడి అధిక సంఖ్యలో మరణాలు సంభవించడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించారు. కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు గంగరేగువలస సమీపాన గల ప్రైవేట్ పురుగుల మందు తయారీ పరిశ్రమను అధికార బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా తహశీల్దార్ సి హెచ్.సత్యనారాయణ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, కాలుష్యనియంత్రణ, వైద్య ఆరోగ్యశాఖ, జంఝావతి ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేయాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. పురుగుల మందు ఫ్యాక్టరీ ద్వారా కేన్సర్ వ్యాప్తి చెందుతుందని ప్రజా సంఘాలు, స్థానిక రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలనకు వచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా పురుగుల మందు ఫ్యాక్టరీ పక్కనే ఉన్న చెరువును, మందుల ఫ్యాక్టరీని పరిశీలించారు. అనంతరం ఫిర్యాదు ఇచ్చిన రైతులతో పాటు పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడారు. అనంతరం కాలుష్య నియంత్ర బోర్డు అధికారులతో చర్చలు జరిపి పరిశ్రమకు ఎంత మేరకు అనుమతులు ఉన్నాయి, ఇక్కడ తయారు చేసే మందుల వల్ల ఎటువంటి వ్యాధులకు గురై ప్రభావం ఉందా, లేదా పరీక్షలు చేసి నివేదికలు అందజేస్తామని తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పంచాయతీలో కొంతమంది రక్త నమోనాలు సేకరించి టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. నాలుగు శాఖల అధికారులు త్వరలో నివేదికలు తీసుకున్న తర్వాత జిల్లా కలెక్టర్‌కు పూర్తిస్థాయిలో నివేదికలు అందజేస్తామని తహశీల్దార్ తెలిపారు. అనంతరం జంఝావతి సబ్ డివిజన్ పక్కనే ఉన్న షెడ్డులో పరిశ్రమ యాజమాన్యం కెమికల్ మందు రసాయనాలు, గులుకులు వంటి నిల్వ చేసిన విషయాన్ని రైతులు చూపించారు. గతంలో ఈ షెడ్‌లో ధాన్యం, ఇతర పంటలను పెట్టుకునేందుకు అవకాశం ఉండేదని, ప్రస్తుతం ఈ మందులు పెట్టడం వల్ల ఆ కొంపునకు వెళ్లలేకపోతున్నామని రైతులకు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ పరిశీలనలో నాలుగు శాఖల అధికారులు, ఫిర్యాదు ఇచ్చిన రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి

గంగరేగువలస, రాజ్యలక్ష్మి పురం గ్రామాల్లోని రైతులకు, ప్రజలకు, కేన్సర్ రోగులకు న్యాయం జరిగేలా అధికార బృందం చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. కేన్సర్ వ్యాప్తికి కారణమవుతున్నట్లు ఆరోపణలున్న మందుల పరిశ్రమను అధికారుల బృందం రైతులతో కలిసి సిపిఎం నాయకులు కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ పురుగులు మందు ఫ్యాక్టరీపై ఉన్న అభియోగాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి పంచాయితీ ప్రజలకు వాస్తవాలు తెలపాలన్నారు. ఏడేళ్ల క్రితం ప్రారంభించిన పురుగుల మందు ఫ్యాక్టరీ వల్ల పొలాల్లోని బోర్లలో నీరు కలుషితమవుతుందన్నారు. విపరీతమైన దుర్వాసన వస్తుందని దీనివల్ల ఇప్పటికే గంగరేగివలస, సోమినాయుడు వలసలో 12 మంది, రాజ్య లక్ష్మి పురంలో ఆరుగురు కేన్సర్ వ్యాధితో చనిపోవడంతో పాటు మరికొంత మంది వివిధ రకాల క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారని అన్నారు. కావున ఎటువంటి ఒత్తిడి లేకుండా ఇకనైనా పూర్తిస్థాయిలో అధికారులు దర్యాప్తు చేపట్టి నివేదికలను గ్రామ సభల ద్వారా పంచాయతీ ప్రజలకు తెలియజేయాలని కోరారు. రైతులు చేస్తున్న పోరాటానికి సిపిఎం మద్దతు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే కేన్సర్‌తో చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, బాధితులకు అన్ని విధాలా భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ జి వెంకట్ నాయుడు, రైతులు మరిచర్ల సింహాసలం, మరిచర్ల సత్యనారాయణ, గంగ రేగువలస రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో పర్యటించిన అధికారులు



కలుషితమైన చెరువును పరిశీలిస్తున్న అధికార బృందం, రైతులు

రాజుకుంటున్న తాటిపూడి రాజకీయం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలోని తాటిపూడి రిజర్వాయరు నీటి రాజకీయం రాజుకుంటోంది. ఎంఎస్ఎంఇ పరిశ్రమల ఏర్పాటు సంగతేమో గానీ, ప్రస్తుతం నీటి రాజకీయం వేడెక్కింది. ఈ వ్యవహారం కాస్త జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు తలనొప్పిగా మారింది. ఇదే అదునుగా మంత్రిని రాజకీయంగా ఇరికించాలని ప్రత్యర్థులు ప్రయత్నిస్తుండగా, తమకేం సంబంధం లేదన్నట్టుగా ప్రతిపక్ష పార్టీ తప్పుకుంటోంది. జిందాల్ భూముల్లో ఎలాంటి పరిశ్రమలు వస్తాయో, వాటికి ఎంతమేర నీటి అవసరాలు ఉంటాయో.. ఇంకా తెలియక ముందే రాద్ధాంతం చేయడం తగదని మంత్రి నిన్నకాక మొన్న క్లారిటీ ఇచ్చారు. ఏమీ జరగకపోతే ఇటీవల కలెక్టర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలంటూ శృంగవరపుకోట ఎమ్మెల్యే, డిసిఎంస్ చైర్మన్ ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాటిపూడి నీటిని ఎంఎస్ఎంఇ పార్కుకు కేటాయిస్తే సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయంటూ చేస్తున్న ఆందోళన కొనసాగుతోంది. మన జిల్లా మీదుగా ప్రవహించే గోస్తనీ నదిపై గంట్యాడ మండల పరిధిలోని 1963 -1968 మధ్యలో తాటిపూడి జలాశయాన్ని నిర్మించారు. గంట్యాడ, జామి, శృంగవరపుకోట మండలాల పరిధిలో 15,378 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. నాటి అవసరాల రీత్యా విశాఖ నగరానికి తాగునీటి అవసరాలకు కూడా కొంతనీటిని మళ్లించారు. అప్పట్లో విశాఖతో కుదిరిన ఒప్పంద కాలపరిమితి ముగిసిపోయిన నేపథ్యంలో తాటిపూడి మొత్తం నీటిని సాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలనే డిమాండ్ చాలా కాలం క్రితమే రైతుల నుంచి ముందుకొచ్చింది. అనేక సందర్భాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు, విజ్ఞాపనలు అందు



తూనే ఉన్నాయి. మరోవైపు అరకు, అనంతగిరి ఏజెన్సీలో తలపెట్టిన బాక్సైట్ తవ్వకాలు ప్రజా ప్రతిఘటన కారణంగా నిలిచిపోవడంతో 2007లో జిందాల్ కోసం శృంగవరపుకోట మండలం మూలబొడ్డవర వద్ద ప్రభుత్వం కేటాయించిన 1166 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉండిపోయింది. ఐదేళ్ల కాల పరిమితి దాటడంతో భూములు వెనక్కి తీసుకోవాలన్న నిబంధనను ప్రస్తుతం, గతం.. అనే తేడా లేకుండా మారిన ప్రభుత్వాలన్నీ అతిక్రమించాయి.

ఈ సంగతి కాస్త అటుంచితే... బొడ్డవరలో జిందాల్‌కు కేటాయించిన భూముల్లో ఎంఎస్ఎంఇ పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్టు గతంలో వైసిపి ప్రభుత్వమే 14, 106 జిఒలను విడుదల చేసింది. ప్రస్తుతం టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, గత ప్రతిపాదించిన ఎంఎస్ఎంఇ పార్కుగా మారుస్తున్నామంటూ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇదే జరిగితే తమకు సాగునీటి ఇబ్బందులు తలెత్తుతాయంటూ ఓవైపు రైతులు, రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలి తప్ప తమ పార్టీకేమీ సంబంధం లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తేల్చిచెప్పారు. ఎలాంటి పరిశ్రమలు వస్తాయి? ఎంత మేర నీటి అవసరాలు ఉంటాయనేది ఇంకా ప్రభుత్వమే చర్చించలేదని మంత్రి కూడా తేలిపోయారు. ఇదే నిజమైతే వైసిపి హయాంలో 2023 ఫిబ్రవరి 23న జారీచేసిన జిఒ 14 సంగతేమిటనేది రైతులు, వారి తరపున మాట్లాడుతున్న వారి వాదన. ఈ ఉత్తర్వుల ప్రకారం ఎంఎస్ఎంఇ పరిశ్రమకు తాటిపూడి ద్వారా నీటిని కేటాయించాలనే నిబంధన పెట్టారని, అప్పట్లో వైసిపి ఇలాంటి జిఒ ఎందుకు తీసుకొచ్చిందో? టిడిపి ఎందుకు ప్రతిఘటించ లేదో? చెప్పాలని జనం ప్రశ్నిస్తున్నారు. ఆ జిఒను రద్దుచేయకుండా రైతులకు అన్యాయం జరగదని మంత్రి చెప్పడం సరికాదనే వాదన కూడా వినిపిస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపాలనే చిత్తశుద్ధి ఉంటే రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను వెల్లడించాల్సి ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

చెట్ల కొమ్మలు తొలగింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని ఐదో వార్డులో గల అమ్మిగారి కోనేరు గట్టు వీధిలో ఉన్న విద్యుత్ వైర్ల ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్‌శాఖ అధికారులు శనివారం తొలగించారు. 'ప్రజాశక్తి'లో శనివారం ప్రచురితమైన 'ప్రమాదం జరిగితే గాని స్పందించరా' అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆ ప్రాంతానికి విద్యుత్ అధికారులు వచ్చి పరిశీలించి సిబ్బందితో చెట్ల కొమ్మలను తొలగించి లైన్లను సరి చేశారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు.

గంబూసియా చేప పిల్లలు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుమ్మంగి సేవల కేంద్రం వద్ద ఆరోగ్య కార్యకర్తలకు గంబూసియా చేప పిల్లలను శనివారం పంపిణీ చేశారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని నీలకంఠాపురం, మొండెంఖల్, తాడికొండ, రేగిడి, దుడ్డుఖల్లు పిహెచ్‌సిల పరిధిలో గల చెరువులు, గెడ్డవాగులు, నీటికుంటల వద్ద గంబూసియా చేప పిల్లలను విడుదల చేసేందుకు పంపిణీ చేసినట్లు గుమ్మలక్ష్మీపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు తెలిపారు. వర్షాకాలంలో దోమల ఉత్పత్తిని తగ్గించేందుకు ప్రతి ఏటా గంబూసియా చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంటిఎస్ జి.కేశవరావు, ఆరోగ్య కార్యకర్తలు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ గ్రామానికి మధ్యాహ్నం పూట బస్సు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రానికి వివిధ పనులతో పాటు తహశీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో పనులు, బ్యాంకులు, అటవీ ఉత్పత్తుల అమ్మకం చేపట్టిందుకు తాడికొండ పంచాయతీ పరిధిలోని ఎనిమిది గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి వెళ్తుంటారని తెలిపారు. మధ్యాహ్నం పూట బస్సు సౌకర్యం లేకపోవడంతో ఈ పంచాయతీ ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మధ్యాహ్నం పూట తాడికొండ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ప్రసాద్

చెత్త సేకరణ పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పనుకుపేట పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణను ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ ప్రతి ఇంటి వద్దకు వచ్చి బుట్టల ద్వారా చెత్త సేకరణ చేపట్టాలన్నారు. సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. అలాగే చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేసి దాన్ని ఆర్థిక వనరుగా మార్చుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను పరిశీలించి అక్కడ వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ కలిపి సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించరాఉ. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, సర్పంచ్ బంకురు పద్మావతి పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

'సుపరిపాలన తొలి అడుగు'పై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంపై పార్టీ నాయకులతో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శనివారం సమీక్షించారు. పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి గత మూడు రోజులుగా చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన స్పందన, ప్రజలు ప్రస్తావించిన సమస్యలు, కూటమి ప్రభుత్వం పాలనపై ప్రజల అభిప్రాయం గురించి ఆరా తీశారు. ప్రజలు చెప్పే ప్రతి సమస్యను రికార్డు చేయాలని నాయకులకు సూచించారు. అలాగే మరింత చురుకుగా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లోకి వెళ్లాలని నిర్దేశించారు. ప్రజల ఆశలకు అనుగుణంగా మనం ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, అందరితోనూ సయోధ్యగా నడుచుకోవాలని నాయకులకు ఎమ్మెల్యే సూచించారు.

కిమ్మిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మిలో శనివారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహం, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శుభారతమణి, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎస్సై పి.నారాయణరావు అన్నారు. మండలంలోని సేకుపాడు, రంగుపురం, దండుసుర గిరిజన గ్రామాల్లో ప్రజలకు సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన శనివారం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు గురిచేస్తుంటారని, కావున అటువంటి మాటలను ఎవరూ నమ్మొద్దని అన్నారు. అలాగే మత్తు పదార్థాలకు, మద్యానికి ఎవరూ బానిసకాకుండా ఉంటూ కుటుంబాలను సక్రమంగా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెండు కేజీల కణితి తొలగింపు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిలో విజయనగర జిల్లా వంగర మండలం పెద్దరాజుల గుమ్మడకు చెందిన ఆర్.అమ్మడమ్మ ఫైబ్రాయిడ్ (కణితి) ఈ కేజీ గర్భాశయం నుంచి తొలగించారు. ఈ శస్త్రచికిత్సను ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయనకు సహాయకులుగా వైద్యులు రత్నాకర్, ఉష, జయకృష్ణ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

సీతంపేట : మండలంలోని ముత్యాలు గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను ఎపిఒ చినబాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను పాఠ్యాంశాల బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


బిఎల్‌ఒలకు శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ కె.జయ ఆధ్వర్యంలో శనివారం బిఎల్‌ఒలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్లో బిఎల్వోలు నిర్వహించాల్సిన విధులు బాధ్యతలు, కొత్తగా ఓటు హక్కు చేర్పించే విధానం పోలింగ్ స్టేషన్ వారిగా ఓటర్ల తయారు చేసే జాబితా విధానం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌డిటి సురేష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెలో ప్రజలంతా పాల్గొనాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు



విలేకుల సమావేశంలో మాట్లాడుతున్న గంగునాయుడు

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక రావాడ కాంప్లెక్స్ విలేకరులతో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కార్మికులు సాధించుకున్న 42 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా ఏర్పాటు చేసి పనిగంటలను 8 నుంచి 12గంటల వరకు పెంచి కార్మికుల హక్కులను కాలరాస్తూ, వారికి పనికి తగ్గ వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులను గురిచేస్తుందని అన్నారు. ఈ లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు వారి హక్కుల కోసం కనీసం సమ్మె, ధర్నా సంఘాలు పెట్టుకునే హక్కు కూడా కోల్పోతున్నారని అన్నారు. అంతేకాకుండా ఉపాధి హామీ, వ్యవసాయ చట్టాలను పూర్తిగా నీరుగారుస్తూ గిరిజన ప్రాంతంలో అటవీ హక్కులు చట్టాన్ని కూడా తుంగలో తొక్కి కార్పొరేట్లకు అడవిని ధారాదత్తం చేయడానికి చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మక నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తూ కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడంలో దారుణమన్నారు. కావున కార్మికుల హక్కుల సాధన కోసం ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అలాగే కార్మికులు, కర్షకులు అన్ని రకాల వర్గాల ప్రజలు ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.




బలిజిపేటలో ఎంఇఒకు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

బలిజిపేట : ఈనెల 9న జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు మధ్యాహ్న భోజన నిర్వాహక సంఘం నాయకులు ఎంఇఒ ఎస్.సింహాచలంకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, మధ్యాహ్నం భోజనం నాయకులు లక్ష్మమ్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక కర్షక సార్వత్రిక సమ్మెలో భాగంగా మండలంలో గల మధ్యాహ్న భోజన నిర్వాహకులు, స్కూళ్ల స్వీపర్లు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం, స్కూల్స్ స్వీపర్ల సంఘం నాయకులు మజ్జమ్మ, నక్షత్ర, నారాయణమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా, జీవో నెంబర్ 21 ఉపసంహరించుకోవాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని ఈనెల 9న జరుగు దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ ఆటో డ్రైవర్స్ కార్మిక సంఘాలు (సిఐటియు) ఆధ్వర్యంలో శనివారం సమావేశం రాము అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వ్యతిరేకంగా ఈనెల9న జాతీయ సమ్మెను, అఖిలభారత కార్మిక సంఘాలు మరియు స్వతంత్ర ఫెడరేషన్లు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈప్రాంతంలో కూడా పాల్గొని జయప్రదం చేయాలని ఆటో కార్మికులందరికీ పిలుపునిచ్చారు. బామిని, తంపటాపల్లి, చిన్నమంగళాపురం, వీరఘట్టం, స్థానిక ఆటో స్టాండ్ నుండి యూనియన్ నాయకులు నక్క సుధాకర్, రోహిత్, కొయ్యాన అప్పలనాయుడు, ఎస్.రాంబాబు, పక్కి ఈశ్వరరావు, వి.రవి, ఆర్.శేఖరు, కృష్ణ, అప్పారావు, రాజు, దుర్గారావు, వి.మహేష్, రాము, మన్మధరావు, గౌరి, ఆనంద్, నాగరాజు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ స్వీపర్లు ఎంఇఒ శ్యాంసుందరికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు ఆగాలంటే ఈనెల 9న జరిగే సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వినతిని అందజేసిన వారిలో ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘ నాయకులు పార్వతి, రవణమ్మ, పాఠశాల స్వీపర్ల సంఘ నాయకులు కె.రాధ, లక్ష్మి, సిఐటియు మండల కన్వీనర్ కృష్ణారావు, కో-కన్వీనర్ దాలమ్మ, సభ్యులు జి పవన్, సిఐటియు జిల్లాకార్యదర్శి ఎన్‌వై నాయుడు పాల్గొన్నారు.

పాచిపెంట : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ పథకం నాయకులు కల్యాణి, మంగమ్మ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంఇఒ సతీష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ జులై 9న జరగబోయే సార్వత్రిక సమ్మెలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులంతా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జగదీశ్వరికి వినతిని అందజేస్తున్న పెద్దవలస గిరిజనులు

సాగు భూమికి పట్టాలు మంజూరు చేయాలి

ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సాగు చేస్తున్న తమ భూములకు పట్టాలు మంజూరు చేయాలని జియమ్మవలస మండలం పెదమేరంగి పంచాయతీ పెద్దవలసకు చెందిన 33 కుటుంబాలు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతిని అందించారు. గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. 30 ఏళ్లుగా 18 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నప్పటికీ నేటికీ పట్టాలు మంజూరు కాలేదన్నారు. పట్టాలు మంజూరు చేసి భూములకు రక్షణ కల్పించాలని కోరారు. తమ గ్రామాలకు రోడ్లు వేయాలని, పక్కాఇళ్లు మంజూరు చేయాలని తదితర సమస్యలపై ప్రజా దర్బార్‌లో వినతులు వచ్చాయి. కార్యక్రమంలో కురుపాం ఎఎంసి చైర్మన్ కద్రక కళావతి, నియోజకవర్గ మహిళ కార్యదర్శి వెంపటాపు భారతి, తెలుగు రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, పోల్ మేనేజ్మెంట్ సభ్యులు పొట్నూరు వెంకట నాయుడు, జిమ్మయ్యవలస ఎంపిపి బొంగు సురేష్, నాయకులు లంకా గోపాల్, తమ్మయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అదానీతో, సెకీ సంస్థలతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని, పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ పర్యవేక్షణ ఇంజనీరింగ్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలో కొస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని అదాని, సెకీ సంస్థలతో విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిలోనే విద్యుత్ ఛార్జీలను మూడుసార్లు పెంచి ప్రజలపై రూ.15,487 కోట్లు భారం మోపిందని విమర్శించారు. ఇప్పటికే ఇంటి పన్నులు, నీటి చార్జీలు, నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే మళ్లీ విద్యుత్ చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. విద్యుత్ ఒప్పందాలు రద్దుకై, పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించేంత వరకూ పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవ, జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, ఇవి నాయుడు, కూరంగి గోపీ నాయుడు, జిల్లా సమితి బిటి నాయుడు, సాలాపు అనంత రావు, సింహాద్రి దుర్గారావు, సింహాద్రి కిరణ్, పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పాలకొండ

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శనివారం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. వీరఘట్టం నుంచి పాలకొండ మీదుగా తరలిస్తున్న బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు చెక్‌పోస్ట్ జంక్షన్ దగ్గర పట్టుకున్నారు. అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు నిఘా పెట్టి సుమారు 2వేల కేజీల బియ్యాన్ని పట్టుకున్నారు. శ్రీకాకుళం ప్రాంతీయ కార్యాలయ విజిలెన్స్ ఎస్సై రామారావు, సిబ్బంది లక్ష్మీనారాయణ, కన్నబాబుతో పాటు ఆర్ఐ బాబురావు తదితరులు ఉన్నారు. 6ఎ కేసును నమోదు చేసినట్లు చెప్పారు.

వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర అమలు పై ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి -కురుపాం

వికసిత్ భారత్ -స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమం అమలుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఐదు మండలాల అధికారులకు నియోజకవర్గ ప్రత్యేక అధికారి ధర్మచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికసిత భారత్-స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమం అమలు, ఎదురౌతున్న సమస్యలు, ఇంకా ఏఏ సేవలు అమలు చేస్తే మంచిది, ప్రజల అవసరాలను తీర్చేందుకు ఎలాంటి సర్వే అవసరం ఎంపిడిఒలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పథకం అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, పలు సూచనలు సలహాలు అందించారు. ఈ వికసిత భారత్-స్వర్ణాంధ్ర-2047 నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక కమిటీకీ స్థానిక ఎమ్మెల్యే చైర్మన్‌గా, నియోజకవర్గ ప్రత్యేక అధికారి కన్వీనర్‌గా, ఐదు మండలాల్లో ప్రత్యేక అధికారులు మెంబర్లగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ ఎ.మణిరాజ్, ఐదు మండలాల ఎంపిడిఒలు, తహశీల్దార్లు, ఇఒపిఆర్‌డిలు, ఇంజినీరింగ్ అధికారులు, ఎంఇఒలు, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కర్రివలసలో సర్పంచ్ ప్రతినిధి మర్రి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువలు, రోడ్లపై చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. దీంతో కాలువల్లో పూడికలు, రోడ్లపై చెత్తాచెదారాలు తొలగించారు. గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను జెసిబి సహాయంతో ట్రాక్టర్‌కు లోడ్ చేసి ఊరు బయట డంప్ చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరావు మాట్లాడుతూ గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని అన్నారు. ముఖ్యంగా దోమల బెడద తగ్గి మలేరియా, డెంగీ వంటి వ్యాధులు దరిచేరవని అన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి - కొమరాడ

సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ కెవిఎస్ పద్మావతి అన్నారు. శనివారం కొమరాడ, కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. గర్భిణీల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలని, అబా ఐడి క్రియేట్ చేయాలని సూచించారు. అదేవిదంగా మలేరియా నమోదైన కేసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సికిల్‌సెల్ ఎనీమియా అన్ని స్కూలు పిల్లలకు పరీక్షలు చేయాలి సూచించారు. అనమియ యాక్షన్ కమిటీలో భాగంగా రక్తం తక్కువగా ఉన్న గర్భిణీలు ఎలాంటి ఆహారం తీసుకోవాలో సూచించారు. ఎనీమియా తగ్గడానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలో సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ గణేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కచ్చితమైన సమాచారాన్ని అందజేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా పోలీసుశాఖలో క్రియాశీలకమైన స్పెషల్ బ్రాంచ్ విభాగంలో పని చేస్తున్న పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన సమాచారం అందజేయాలని ఎస్‌పి ఎన్‌వి మాధవరెడ్డి సూచించారు. శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్‌పి సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణలో స్పెషల్ బ్రాంచ్ పోలీసుల పనితీరు చాలా క్రియాశీలకమన్నారు. కావున, సిబ్బంది క్షేత్ర స్థాయిలో ముందస్తు సమాచారాన్ని సేకరిం చేందుకు సమాచార వ్యవస్థను మెరుగుపర్చుకోవాలన్నారు. ఖచ్చితమైన సమాచారం వచ్చేలా వారితో ఎప్పటికప్పుడు మమేకమై అభిప్రా యాలూ తెలుసుకోవాలన్నారు. ప్రతీ రోజు జరిగే విషయాలన్నిటిని రికార్డు రూపంలో భద్ర పరుచుకోవాలని, రికార్డులను ఎప్పటిక పుడు అప్ డేట్ చేయాలని సూచించారు. ప్రజలతో నిత్యం మమేక మవుతూ, పక్షపాత ధోరణి లేకుండా సక్రమంగా విధులు నిర్వహించాలని, క్రైమ్ బ్రాంచ్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తో సమన్వయం ఏర్పరుచుకుంటూ పని చేయాలని సూచించారు. అనంతరం సమాచార సేకరణలో ప్రతిభ కనబరచిన అధికారులకి, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

ఘనంగా రథయాత్ర

పార్వతీపురం టౌన్ : పట్టణంలో జగన్నాథ స్వామి మారు రథయాత్ర దేవాదాయ శాఖ ఇఒ ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా శనివారం జరిగింది. పాలకొండ రోడ్‌లో గుడించా మండపంలో ఉన్న జగన్నాథ స్వామి, బలరామ స్వామి, సుభద్ర దేవి విగ్రహాలకు ఆలయ పురోహితులు, ఒరియా బ్రాహ్మణులు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రతో ప్రత్యేక పూజల నిర్వహించిన అనంతరం విగ్రహాలను రథంపై ఉంచి ఊరేగింపుగా రథాన్ని తీసుకొని పాలకొండ రోడ్ నుండి పాత బస్టాండ్ కూడలి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు.



సాలూరు : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మండల టిడిపి అధ్యక్షులు పరమేష్

కురుపాంలో 'సుపరిపాలన తొలి అడుగు'

ప్రజాశక్తి - కురుపాం


టిడిపి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం శనివారం మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్‌కుమార్ ఇంటింటికి వెళ్లి సంవత్సర పాలనలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు గూర్చి వివరించి ప్రభుత్వంపై ప్రజల స్పందనను తెలుసుకున్నారు. అనంతరం సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కర్రి శ్రీను, చందక రామకృష్ణ, బలగ రామకృష్ణ, చంటి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని పెద బోరబందలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి హయాంలో మండలంలో ఏ ఒక్క గ్రామానికి మౌలిక సౌకర్యాలు కల్పించకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక పొంతనలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధిని చేసేవారిని అడ్డుకోకుండా, రాజకీయాలు చేయకుండా వారిని ప్రోత్సహించి ముందుకు వెళ్లేలా అందరూ కలిసికట్టుగా రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు నడిమింటి రామకృష్ణ, బూస తౌడు, మత్స శ్యాంసుందర్, త్రినాధరావు వెంకటేష్, గిరిజన నాయకులు లక్ష్మణదొర, కోట లక్ష్మణ, వెంకటరమణ పాల్గొన్నారు.

పోస్టల్ డబ్బులపై లబ్ధిదారుల ఆందోళన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గెడ్డలుప్పికి చెందిన పోస్టల్ ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులు అందించిన వివరాల మేరకు గడ్డలుప్పి పోస్టుమాస్టర్‌గా బొమ్మి రాణి విధులు నిర్వహిస్తున్నారు. దూరప్రాంతాల ఉన్న బ్యాంకులకు వెళ్లలేని వారంతా స్థానిక పోస్ట్‌ఆఫీస్‌లో డబ్బులు దాచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సుదీర్ఘకాలంగా పోస్టాఫీస్ ఖాతాలో ఆర్డి సూర్య సమృద్ధి యోజన బ్రాండ్ డిపాజిట్ల నిర్దేశించిన గడుగులు పూర్తయ్యాయి. బాండ్లు మెచ్యూరిటీ అయిన 50 మందికి పైబడి ఉన్న వారంతా ఇటీవల బాండ్లు ఇచ్చి కాగితాలపై పోస్ట్మాస్టర్ వద్ద వేలిముద్రలు వేశారు. వేసిన తర్వాత పోస్టుమాస్టర్ విధులకు గైహాజరయ్యారు. డబ్బులు కోసం నాలుగు రోజులుగా పోస్ట్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు. పోస్ట్మాస్టర్ విధులకు హాజరు కాకపోవడంతో ఖాతాదారులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శనివారం స్థానిక పోస్ట్ ఆఫీస్‌కు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వచ్చి పోస్ట్ ఆఫీస్‌లో ఉన్న ఖాతాదారుల రికార్డులు పరిశీలించారు. పరిశీలన సమయంలో పోస్ట్మాస్టరు విధిగా హాజరుకావాలని నోటీసులు ఇచ్చినా హాజరు కాలేదు. దీంతో నిధులు



పోస్టల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

దుర్వినియోగం చేసినట్లు భావించాల్సి వస్తుందని ఖాతాదారులు అంటున్నారు న్యాయం చేయాలని కోరుతూ పోస్ట్ ఆఫీస్ ఎదుట ఖాతాదారులు నిరసన తెలిపారు. ఖాతాదారులకు న్యాయం చేసే చర్యలు చేపడతామని రికార్డులు పూర్తిస్థాయిలో రికార్డు చేసి పోస్టల్ ఎస్‌పికి నివేదిక అందజేస్తామన్నారు.

రైతు, వినియోగదారుల శ్రేయస్సుకు ఆర్‌ఎ ధ్రువీకరణ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతులు, వినియోగదారుల శ్రేయస్సు రైట్ ఫారెస్ట్ అలయన్స్ ధ్రువీకరణ పత్రం దోహదపడుతుందని రైన్ ఫారెస్ట్ అలయన్స్ సంస్థ అసోసియేట్ ట్రైనింగ్ నెట్వర్క్ రిసోర్స్ పర్సన్ ఎస్. నేఫా అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్‌లో రెండురోజుల పాటు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. జట్టు ట్రస్ట్ సహకారంతో ఏర్పడ్డ మాభూమి - అన్నపూర్ణేశ్వరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీల బోర్డు డైరెక్టర్లకు ఆర్‌ఎ ధ్రువీకరణ, వాటి వల్ల పొందే లాభాల గురించి శిక్షణ ఇచ్చారు. అనంతరం నేఫా మాట్లాడుతూ రైన్ ఫారెస్ట్ అలయన్స్ సర్టిఫికేషన్ రావాలంటే వారు పొందుపర్చిన 7 ప్రామాణికాలను ఖచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. వీటిలో ముఖ్యంగా యాజమాన్యం - నిర్వహణ, వ్యవసాయం - సాగు, సామాజిక అంశాలు - పరిస్థితులు, ఉత్పత్తి సమాచారం - గుర్తింపు నిర్ధారణ, బాధ్యతలు - పంపిణీ, భూమి - ఆరోగ్యం, పర్యావరణం మొదలైన అంశాలపై గల సుస్థిర వ్యవసాయ ప్రామ్మాణికాలను వాటి అమలును గూర్చి వివరించారు. ఆర్‌ఎ ధ్రువీకరణ ఇచ్చే సంస్థ ఆడిట్ చేసే సమయంలో ప్రతి చిన్న అంశాన్నీ పరిశీలిస్తుందన్నారు. ధ్రువీకరణ ఇవ్వాలనుకున్నప్పుడు ఆయా రైతులు, రైతు సంఘాలు వాడుతున్న ఎరువులు, పురుగుమందులు పర్యావరణానికి, మానవులకు, జీవవైవిధ్యానికి, నేలకు, వన్యప్రాణులకు హానిజరుగని విధంగా ఉండాలని అన్నారు. 150 దేశాల్లో ఆర్‌ఎ ధ్రువీకరణ పొందిన ఉత్పత్తులను అమ్ముకోవచ్చునని, అందువల్ల అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలుతో నిర్ధారణ జరుగుతుందని తెలిపారు. ప్రతి రైతు తోటి రైతులు అవలంబిస్తున్న వ్యవసాయ విధానాలను పరిశీలించాలని, అంతర్గత తనిఖీ, స్వీయ శక్తి అధ్యయనం, ప్రమాద అంచనా మదింపు మొదలైన అసెస్మెంట్ జరిగినప్పుడే ధ్రువీకరణ పొందడం సులువు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సరోజ్ ప్రహారాజ్, మాభూమి ఎఫ్‌పిసి చైర్మన్ తాడేల మన్మధ నాయుడు, అన్నపూర్ణేశ్వరీ ఎఫ్‌పిసి చైర్మన్ దత్తి వెంకటనాయుడు, కో-ఆర్డినేటర్ మనికుమార్, ఈ రెండు సంస్థల డైరెక్టర్లు, సిబ్బంది, జట్టు ట్రస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రసవమే ధ్యేయంగా వైద్యసేవలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మాతా, శిశు ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆదేశించారు. ఆశా నోడల్ అధికారులకు శనివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సమావేశంలో మాతాశిశు ఆరోగ్య సేవలపై ఆయన సమీక్షించారు. ఆర్‌సిహెచ్ మాతాశిశు నమోదులో ఎఎన్ఎం, ఆశాల పనితీరు విశ్లేషించాలని, ఈ ఆశా యాప్‌లో సూచికల వివరాలు పరిశీలించాలని అన్నారు. గర్భిణీలకు హిమోగ్లోబిన్, షుగరు పరీక్షలు(జిడిఎం), బిపి, క్షయ, సిఫిలిస్, ఇసిజి పరీక్షలు తప్పనిసరని అన్నారు. గత సంవత్సర సేవలపై విశ్లేషించి పురోగతి దిశగా కృషి చేయాలన్నారు. రక్తహీనత గుర్తించిన గర్భిణీ, బాలింతలకు నివారణపై, సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలపై దృష్టి సారించాలన్నారు. అన్ని పిహెచ్సీల్లో ప్రసవాలు తప్పనిసరిగా జరగాలన్నారు. పిహెచ్సీల వారీగా డెలివరీ నివేదికలను ప్రతి నెలా సమీక్షిస్తామన్నారు. గిరిశిఖర, మారుమూల ప్రాంత గర్భిణీలను వసతి గృహాల్లో ముందస్తుగా చేర్చాలన్నారు.

మలేరియా నియంత్రణకు చర్యలు :డిఎంహెచ్ఒ

జిల్లాలో మలేరియా నియంత్రణ ధ్యేయంగా లక్ష గంబూషియా చేపలను మొదటి విడతగా సరఫరా చేశామని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు అన్నారు. కొత్తవలస చెరువులో శనివారం ఆయన గంబూషియా చేపలను విడుదల చేశారు. జిల్లాలో ముందుగా గుర్తించిన 178 చెరువుల్లో చేపపిల్లలను విడుదల చేశామన్నారు. ఇప్పటికే 915 గ్రామాల్లో ఐఆర్ఎస్ మొదటి దశ స్ప్రేయింగ్ పూర్తి చేశామని, ప్రస్తుతం రెండో విడత జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉంటూ జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎప్పటికపుడు ఫీవర్ సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహన్, డాక్టర్ రఘు, డాక్టర్ వినోద్, డాక్టర్ కౌశిక్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, .ఎఎంఒ సూర్యనారాయణ, కన్సల్టెంట్ రామచంద్ర, సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది సుజాత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రథయాత్రకు వెళ్తూ ఆటో బోల్తా

పలువురికి గాయాలు

కురుపాం : ఒడిశాలోని రాయగడ రథయాత్రకు ఆటోతో వెళ్తూ పిప్పలగూడ ఘాట్ వద్ద బోల్తా పడి ఐదుగురికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం ఈ ప్రమాదంలో గుమ్మలక్ష్మీపురం మండలం కొండుకుప్ప గ్రామానికి చెందిన పత్తిక సుమతి, పత్తిక స్నేహ, పత్తిక జయంతి, మూలిగూడ గ్రామానికి చెందిన పత్తిక శ్రీరామ్, జీలకర్ర స్రవంతికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 ద్వారా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అక్కడ వైద్య అధికారులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు తెలిపారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.